సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం | 4 | జూన్ | 2023



అలరించిన 'కరిష్యే వచనం తవ'

సత్యసాయి సన్నిధిలో మధ్యప్రదేశ్ సత్యసాయి బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'కరిష్యే వచనం తవ' నాటిక అలరించింది. 13లో



సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం

రోజూ అరగంట సైక్లింగ్‌తో ఆరోగ్యంగా ఉండవచ్చని డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 10లో

గరిష్టం/కనిష్టం
39.0°/27.0°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వేళ వేసవితాపం అధికమైంది. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత ఎక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

పుట్టపర్తి అర్బన్: ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటనకు సంబంధించి కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులు ఎవరైనా బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్, కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణించి ఉంటే వారి సమాచారాన్ని తెలుసుకునేందుకు కుటుంబీకులు, బంధువులు 9154968578 నంబర్‌తో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

సోమందేపల్లి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక వసతులన్నీ కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన మండల పరిధిలోని చాకర్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల లబ్ధిదారులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరైనా ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చాకర్లపల్లి లేఅవుట్‌లో 601 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 307 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో, 73 ఇళ్లు ఆర్‌ఎల్ స్థాయిలో, 7 ఇళ్లు ఆర్‌సీ స్థాయిలో, మరో 28 ఇళ్లు బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి తెలిపారు. ఇళ్ల నిర్మాణాలన్నీ వేగవంతం కావాలని, కాలనీల్లో రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పీఆర్ ఈఈ మురళి, హౌసింగ్ డీఈ శివకుమార్ నాయక్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, హౌసింగ్ ఏఈ నారాయణ రెడ్డి, ఈఓఆర్డీ నాగరాజ రావు, ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప పాల్గొన్నారు.

కాలేజీ.. సీటేది!

- పోటీ పరీక్షల ర్యాంకుతో మంచి బ్రాంచ్‌లో సీటు వచ్చేనా?
- ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరికలపై తర్జనభర్జన
- ఉమ్మడి జిల్లాలో 12 కాలేజీలు.. 8వేలకు పైగా ఇంజినీరింగ్ సీట్లు
- ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులు దాదాపు 17 వేల మంది
- తమిళనాడు డీమ్డ్ యూనివర్సిటీలకు పరుగులు



సాక్షి ప్రతినిధి అనంతపురం: ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధించారు. ఏపీ, ఇతర రాష్ట్రాల్లోని విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన పరీక్షలు రాశారు. అందులో వచ్చిన ర్యాంకుతో తాము కోరుకున్న కళాశాలలో సీటు వస్తుందా.. లేక ప్రత్యామ్నాయం చూసుకోవాలా.. అన్న సందేహాలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తర్జన భర్జన పడుతున్నారు. మంచి ప్లేస్‌మెంట్లు కావాలనుకుంటున్న పలువురు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి డీమ్డ్ యూనివర్సిటీలను సైతం పరిశీలించి వస్తున్నారు.

మంచి ప్లేస్‌మెంట్ కోసం...

మంచి ప్లేస్‌మెంట్ రావాలంటే మంచి కాలేజీలో చేరాలి. మంచి కాలేజీలో అంటే మంచి ర్యాంకు రావాలి. నచ్చిన కోర్సు కావాలంటే మంచి కాలేజీ కుదరదు, కాలేజీ బావుందనుకుంటే కావాల్సిన సీటు లేదు.. ఇదీ తంటా. దీంతో చాలామంది విద్యార్థులు తమిళనాడులోని డీమ్డ్ యూనివర్సిటీల బాటపడుతున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కర్ణాటక దగ్గరగా ఉండటంతో కోమెడ్ కే (ఏపీలో ఎంసెట్ తరహా టెస్టు) రాసి అక్కడ చేరుతున్న వారూ ఉన్నారు. జేఈఈ మెయిన్స్‌లో మంచి పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు కర్ణాటకలోని సూరత్‌కల్, తెలంగాణలోని వరంగల్ నిట్ తదితర సంస్థలను ఎంచుకుంటున్నారు.

మధ్యతరగతికి తప్పని కష్టాలు

ఇంజినీరింగ్ కోర్సు ఖరీదైంది. ఇది మధ్యతరగతికి పెద్ద భారంగా పరిణమించింది. ఓ మోస్తరు కాలేజీలో చేరదామన్నా హాస్టల్‌తో కలిపి ఏడాదికి రూ.3 లక్షలకు తక్కువ లేదు. ఇక తమిళనాడులోని శస్త్ర, సత్యభామ, అమృతానందమయి, 'విట్' వంటి కాలేజీల్లో కోర్సు పూర్తయ్యేసరికి రూ.16 లక్షలుపైనే అవుతోంది. దీంతో మధ్యతరగతి కుటుంబాలు మదనపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ప్రభుత్వమే చేస్తుంది.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ పాసైన వారి వివరాలు	
పరీక్షలు రాసిన అబ్బాయిలు	11,609
పాసైన అబ్బాయిలు	7,278
పరీక్షలు రాసిన అమ్మాయిలు	13,517
పాసైన అమ్మాయిలు	9,665
మొత్తం పాసైన వారు	16,943

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు	
ప్రభుత్వ కాలేజీలు	2
ప్రైవేటు కాలేజీలు	10
మొత్తం ఇంజినీరింగ్ సీట్లు	8,100

కానీ దూరపు కొండలు నునుపు అన్నట్టు బయటి రాష్ట్రాల్లో చదువులకు విద్యార్థులు ఎగబడుతున్నారు. ఈ నెల నాలుగో తేదీన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఉండటంతో మరికొంతమంది అదృష్టం పరీక్షించుకోనున్నారు.

మా బాబును డిగ్రీలో చేరుస్తున్నాం



మా కొడుకు ఉదయ్ సాయిది ఈ సంవత్సరం ఇంటర్మీడియెట్ అయిపోయింది. మొదట ఇంజినీరింగ్ చేయించాలనుకున్నాం. కానీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో డిగ్రీ విద్యను ప్రోత్సహిస్తుండటంతో మేము డిగ్రీ వైపు మొగ్గు చూపాము. ఏదేమైనా పిల్లలను ఏ కోర్సులో చేర్పించాలా అన్నది చాలా కష్టంగా ఉంది. సీటు వచ్చే వరకు మాలాంటి వాళ్లకు ఇబ్బందే.
–ఎం.భారతి, గృహిణి, వేణుగోపాల్‌నగర్, అనంతపురం

అన్ని సదుపాయాలూ ఉన్న కళాశాలే మేలు



కోర్సు కన్నా కళాశాల ఎంపిక కీలకం. మౌలిక సదుపాయాలు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న కళాశాలలను గుర్తించాలి. బ్రాంచ్ కన్నా కళాశాల రాణింపు ముఖ్యం. మూడేళ్లుగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులు, అధ్యాపకుల అర్హతలు, గ్రంథాలయం, ల్యాబ్ సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే కళాశాలను ఎంపిక చేసుకోవాలి. రానున్న రోజుల్లో మల్టీడిసిప్లినరీ కోర్సులు రానున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని వనరులూ కలిగిన కళాశాలను ఎంపిక చేసుకోవడమే ఉత్తమం.
– డాక్టర్ రామచంద్ర,ప్రిన్సిపాల్, ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల

కోర్ బ్రాంచ్‌ల్లో అపార అవకాశాలు



కోర్ బ్రాంచుల్లో అవకాశాలు అపారంగా ఉంటాయి. తొలుత జీతం తక్కువైనప్పటికీ, అనుభవం వచ్చే కొద్దీ జీవితంలో స్థిరపడే అవకాశాలు ఉంటాయి. అయితే ఏ కళాశాలలో చదివితే అవకాశాలు అధికంగా ఉన్నాయో బేరీజు వేసుకోవాలి. నేరుగా కళాశాలను సందర్శించి అన్ని వసతులూ ఉన్నాయా? లేదా? పరిశీలించాలి. పూర్వ విద్యార్థులతో ఆరా తీయాలి. విద్యార్థికి నచ్చిన బ్రాంచ్‌ను తీసుకునే స్వేచ్ఛ తల్లిదండ్రులు ఇవ్వాలి. అప్పుడే కోర్సు పూర్తి చేయాలనే శ్రద్ధ కలుగుతుంది.
– కేశవరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, జేఎన్‌టీయూ(ఏ)

గురుకులాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ గురుకుల పాఠశాలలోని (2023-24 విద్యాసంవత్సరం) ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. 5 నుంచి 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదన్నారు

బాలుర పాఠశాలల్లో ఖాళీలు ఇలా...

లేపాక్షి పాఠశాలలో 6వ తరగతిలో ఎస్సీ -1, 8వ తరగతిలో ఎస్టీ-2, 9వ తరగతిలో బీసీ(బీ)లో-1, ఎస్టీ-1 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. గుండుమల పాఠశాలలో 6వ తరగతిలో బీసీ(డి)- 1, 7వ తరగతిలో బీసీ(బీ)-1, బీసీ(ఈ)-1, 8వ తరగతిలో బీసీ(ఏ)1, ఎస్సీ-1, ఎస్టీ-1, 9వ తరగతిలో బీసీ(ఏ)-2, బీసీ(బీ)-01, బీసీ(డి)-1, ఎస్టీ-1 సీట్లు ఉన్నాయి. పేరూరు పాఠశాలలో 6వ తరగతిలో ఓసీ/ఈబీసీ-1, బీసీ(బీ)-1, బీసీ(డి)-1, బీసీ(ఈ)-1, ఎస్టీ-1, 7వ తరగతిలో బీసీ(ఏ)-1, 8వ తరగతిలో బీసీ(ఏ)-1, బీసీ(డి)-1, 9వ తరగతిలో ఎస్టీ-1, రొద్దం -1 పాఠశాలలో 6వ తరగతిలో ఓసీ/ఈబీసీ-1, ఎస్సీ-2, ఎస్టీ-1, 7వ తరగతిలో ఓసీ/ఈబీసీ-1, బీసీ(ఏ)-1, బీసీ(బీ)-3, బీసీ(డి)-1, ఎస్సీ-1, ఎస్టీ-1, 8వ తరగతిలో బీసీ(బీ)-2, బీసీ(డి)-1, ఎస్సీ-1, 9వ తరగతిలో బీసీ(బీ)-2, రొద్దం-2 పాఠశాలలో 8వ తరగతిలో బీసీ(ఏ)-1, బీసీ(బీ)-1 ఖాళీలు ఉన్నాయన్నారు. రేగాటిపల్లి స్కూల్లో 6వ తరగతిలో ఎస్సీ-2, 7వ తరగతిలో బీసీ(డి)-1, 9వ తరగతిలో బీసీ(బి)-1 ఖాళీ ఉన్నాయి.

బాలికల పాఠశాలల్లో ఖాళీలు ఇలా...

టేకులోడు స్కూల్లో 9వ తరగతిలో ఎస్సీ-1, ఎస్టీ-1, నసనకోట పాఠశాలలో 6వ తరగతిలో బీసీ(ఏ)-1, 7వ తరగతిలో ఎస్సీ-1, 8వ తరగతిలో బీసీ(ఏ)-2, బీసీ(డి)-1, ఎస్టీ-1, 9వ తరగతిలో బీసీ(బీ)-2, గుడిబండ పాఠశాలలో 6వ తరగతిలో బీసీ(డి)-1, 9వ తరగతిలో బీసీ(డి)-1, బుక్కపట్నం పాఠశాలలో 6వ తరగతిలో బీసీ(బీ)-1, 7వ తరగతిలో బీసీ(డి)-2, బీసీ(ఈ)-1, ఎస్టీ-1, 9వ తరగతిలో బీసీ(ఏ)-1 ఖాళీలు ఉన్నాయన్నారు.



జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష తొలిరోజు శనివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 522 మంది అభ్యర్థులకు గానూ 402 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అనంతపురం కలెక్టర్ గౌతమి పరిశీలించారు. నిర్దేశిత సమయం దాటిన తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించకూడదని ఆదేశించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

రాగి సాగు విస్తీర్ణం పెంచుదాం

- చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు పూర్తి సహకారం
- ఆర్బీకే వేదికగా సబ్సిడీతో విత్తనాల పంపిణీ
- క్వింటాల్ రాగులు రూ.3,578 మద్దతుతో కొనుగోలు
- మడకశిర నియోజకవర్గ పర్యటనలో జేసీ చేతన్



అమరాపురం: రాగి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జేసీ చేతన్

అమరాపురం/మడకశిర(అగళి)/రొళ్ల/గుడిబండ: తక్కువ పెట్టుబడిలో అధిక ఆదాయంతో వచ్చే చిరుధాన్యాల సాగు విస్తీర్ణం జిల్లాలో మరింత పెంచాలని జాయింట్ కలెక్టర్ చేతన్ కోరారు. ప్రభుత్వం కూడా చిరుధాన్యాలు సాగుచేసే రైతులకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రాయితీతో విత్తనాలు అందజేయడంతో పాటు మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తుందన్నారు. శనివారం ఆయన జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావుతో కలిసి మడకశిర నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. అమరాపురం మండలంలోని కె.శివరం, అగళి మండలంలోని పీబ్యాడిగెర, రొళ్ల మండల పరిధిలోని బొమ్మగొండనహళ్లి, గుడిబండ మండలం మోరుబాగల్‌లోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలు, సిబ్బంది పనితీరు, రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాపై గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ఆర్బీకే పరిధిలోని వివిధ గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. రాగి పంట సాగుపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ చేతన్ మాట్లాడుతూ, చిరుధాన్యపు పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. మడకశిర నియోజకవర్గ రైతులు ఎక్కువగా రాగులు పండిస్తారని, ఈ సారి ఎక్కువ మంది ముందుకు వచ్చి రాగి విస్తీర్ణం పెంచాలన్నారు. రాగి సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తుందన్నారు. రాయితీతో విత్తనం పంపిణీ చేయడంతో పాటు క్వింటాల్ రాగులు రూ.3,578 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. రాగి పంట సాగు చేయడం వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు, వాటిని తిన్నవారికి మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ, పంటలను ఈ-క్రాప్ నమోదు తప్పక చేయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రాగులు విక్రయించే రైతులకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు ప్రభుత్వం ఉచితంగా గోనె సంచులను సైతం సరఫరా చేస్తుందని తెలిపారు. సంచులను రైతులే సమకూర్చుకుంటే ప్రభుత్వం డబ్బులను తిరిగి చెల్లిస్తుందన్నారు. లోడింగ్, రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అశ్వర్థ నారాయణ నాయక్, ఏపీ సీడ్స్ డీఎం ధనలక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్, తహసీల్దార్ హసీనాసుల్తానా, రొళ్ల ఎంపీడీఓ రామారావు, అగళి తహసీల్దార్ జిలాని, అమరాపురం ఎంపీడీఓ మునిస్వామి పాల్గొన్నారు.

'నితిన్‌సాయి' దౌర్జన్యకాండ

- నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ క్రషర్లు ఏర్పాటు
- నాసిరకం కంకరతో రోడ్డు పనులు
- తనిఖీకి వెళ్లిన విజిలెన్స్ అధికారులను అడ్డుకున్న సిబ్బంది



విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మిని అడ్డుకుంటున్న వరదాపురం సూరి అనుచరులు

ధర్మవరం: 'నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్' సిబ్బంది దౌర్జన్యానికి దిగారు. తనిఖీలకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తూ అధికారులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. వివరాల్లోకి వెళితే...మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులు చేస్తోంది. అయితే నిబంధనలను విరుద్ధంగా మొబైల్ క్రషర్ ద్వారా నాసిరకం కంకరను రోడ్డు పనులకు వినియోగిస్తోంది. దీనిపై కొందరు ఫిర్యాదు చేయగా, శనివారం శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లా విజిలెన్స్, భూగర్భ గనుల శాఖ అధికారులు తనిఖీలకు వెళ్లారు. అయితే కంపెనీ ప్రతినిధులు తమ అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనన్న భయంతో రౌడీ మూకలను అడ్డుగా పెట్టి అధికారులపై దౌర్జన్యం చేశారు. తాము కేవలం కంకర నాణ్యతను పరిశీలిస్తామని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి కంకర ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని 'నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్' సిబ్బందిని ప్రశ్నించగా, వారు సమాధానం ఇవ్వలేదు. పోనీ మొబైల్ క్రషర్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు ఇవ్వాలని కోరినా నిరాకరించారు. పైగా తమ అనుచరులను పోగేసి హంగామా చేసి అధికారులపై దౌర్జన్యానికి దిగారు. దీంతో భయాందోళన చెందిన అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

గతంలోనూ అనేక అక్రమాలు..

మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి సంబంధించిన క్రషర్లతో గతంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. వాటిపై ఫిర్యాదు అంది అవి నిరూపణ కావడంతో భూగర్భ గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు భారీ జరిమానాలు కూడా విధించారు. కానీ తీరుమార్చుకోని సదరు కంపెనీ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు తుంగలోకి తొక్కుతూ ఇలా తప్పుల మీద తప్పులు చేస్తూ వెళ్తోంది. ఇప్పటికైనా అక్రమార్కులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమాలు తేలితే కఠిన చర్యలు

నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ కస్తూర్బా గాంధీ స్కూల్ నుంచి మలకవేముల వరకు చేపడుతున్న ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. మొబైల్ క్రషర్‌ల ద్వారా నాసిరకం కంకర, ఇతర సామగ్రిని రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో మేము తనిఖీలకు వెళ్లగా కొంతమంది అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి కంపెనీ ప్రతినిధులకు నోటీసు జారీ చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.
– విజయలక్ష్మి, విజిలెన్స్ ఏడీ

క్లుప్తంగా

'గేట్స్'కు 'అటానమస్'



గేట్స్ ఇంజినీరింగ్ కాలేజ

గుత్తి: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కనే గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా దక్కింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. పదేళ్ల పాటు గేట్స్‌కు ఈ హోదా ఉంటుంది. అటానమస్ హోదా దక్కడంపై ఆ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథరెడ్డి, డైరెక్టర్ వీకే వాణీ, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల అధ్యపకులు, విద్యార్థులు జేఎన్‌టీయూ అధ్యాపక బృందం సూచనలు, సలహాలు పాటించడం వల్లనే ఈ హోదా దక్కిందని ఈ సందర్భంగా గేట్స్ యాజమాన్యం పేర్కొంది.

'108'లో ప్రసవం



నవజాత శిశువును అందజేస్తున్న ఈఎంటీ

మడకశిర రూరల్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణి 108 అంబులెన్స్‌లో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం వేకువజాము 2 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. మడకశిర మండలం గుర్రపుకొండ గ్రామానికి చెందిన ఉమాబాయికి పురిటి నొప్పులు మొదలు కాగానే కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుంది. పరిస్థితి విషమంగా ఉండడంతో గర్భిణిని తీసుకుని మడకశిర ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఆదిరెడ్డిపాళ్యం వద్ద వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ సాయంతో ఈఎంటీ ఆమెకు ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ధ్రువీకరించారు.. ఈ సందర్భంగా 108 సిబ్బందికి ఉమాబాయి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



తనకల్లు: అలంకరణలో ధనకొండ గంగమ్మ దేవత, విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుడు, ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

తనకల్లు: మండల పరిధిలోని కనసానివారిపల్లి సమీపంలో వెలసిన ధనకొండ గంగమ్మ ఆలయంలో శనివారం వేద మంత్రోచ్చారణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పురాతన ధనకొండ గంగమ్మ ఆలయానికి తన సొంత డబ్బులు వెచ్చించి.. విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించిన ఎంజీ రెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఆయనకు అమ్మవారి దీవెనలు ఎల్లవేళలా ఉండాలన్నారు. ఆలయాభివృద్ధికి తనవంతు సాయంగా రూ.1,00,116లను ఎమ్మెల్యే సిద్దారెడ్డి అందజేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం బెంగళూరు నుండి ప్రత్యేకంగా తీసుకొచ్చిన హెలికాప్టర్ ద్వారా గుడిపైకి పూలను చల్లించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్మీకి పవన్ కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ సరస్వతి, నాయకులు శ్రీనివాసుల నాయుడు, చిదానందరెడ్డి, వినోద్‌కుమార్, సమర, రామ్‌దేశాయ్, హేమశేఖర్‌రెడ్డి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆలయ ప్రారంభోత్సవం..

పుట్టపర్తి అర్బన్: గంగిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. మూడు రోజుల పాటు జరిగిన పూజా కార్యక్రమాలు, హోమాలు శనివారం నిర్వహించిన పూర్ణాహుతితో ముగిశాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకలకు జిల్లా నుంచే గాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు చేసి ఆంజనేయ స్వామికి ప్రాణప్రతిష్ట చేశారు. ఆలయ ప్రారంభోత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటకం, కోలాటం, చెక్కల భజన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయం ముందు భాగంలోని చెరువులో ఉట్లమాను ఏర్పాటు చేసి యువకులు ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, వైస్ ఎంపీపీ రంగన్న, కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షురాలు ఉషారాణి, నాయకులు గంగాద్రి, వెంకటరెడ్డి, కుళ్లాయి రెడ్డి, ఆదెప్ప, రామకృష్ణ, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో ఆలయ నిర్మాణం..

పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి చెరువు కట్టపై పురాతన ఆంజనేయస్వామి ఆలయం ఉండేది. దీనిని జీర్ణోద్ధరణ చేసి, సుమారు రూ.1.5 కోట్లతో నూతన ఆలయాన్ని నిర్మించారు. స్థానిక సర్పంచ్ కామాక్షమ్మ, ఆదెప్ప, రామకృష్ణ, ఉపాధ్యాయులు కమిటీగా ఏర్పడి విరాళాలను సేకరించి ఆలయ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కూడా సహకారాన్ని అందించారు.

నేటి నుంచి అంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయంలో ఆదివారం నుంచి మంగళవారం వరకూ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు నరసింహులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు పాటు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 4వ తేదీ స్వస్తి పుణ్యాహవాచనం, కలశస్థాపన, కలశారాధన, ప్రదోషకాలపూజ, మహాస్నపనం, ధాన్యాధివాసం, గణపతి, నవగ్రహ హోమములు అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 5వ తేదీన ప్రాతఃకాలపూజ, దుర్గాహోమం, రుద్రహోమం, ఆదివాస హోమాలు, ప్రదోషకాల పూజ, అంకాలమ్మ హోమం, వాస్తు హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 6వ తేది ఉదయం 6:30 గంటలకు అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట, యంత్ర స్థాపన, పూర్ణాహుతి అనంతరం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం చేస్తామన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పూజల్లో పాల్గొంటారన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

బత్తలపల్లి: మండలంలోని గంటాపురం గ్రామంలో ఆదివారం నుంచి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు నెట్టెం అశోక్, జాస్తీ నాగతేజ, పద్మాకర్, పల్లపోతుల బాబు, జయరాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఎంట్రీఫీజు రూ.1,600, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విజేత జట్టుకు రూ.1,00,116, రన్నర్ జట్టుకు 50,001 అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9100488284, 7075730727 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

టాయిలెట్ల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో టాయిలెట్ల నిర్వహణకు ఈనెల 8వ తేదీ ఉదయం 11 గంటల్లోపు టెండర్లు వేయాలని ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్సులు తెరుస్తామన్నారు. వివరాలకు 9959225859 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం



ప్రశాంతి నిలయం: సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: రోజూ అరగంట పాటు సైకిల్ తొక్కడం ద్వారా మెరుగైన ఆరోగ్యం ప్రాప్తిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం పుట్టపర్తి పీహెచ్‌సీ నుంచి గణేష్ సర్కిల్ వరకూ వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సైకిల్ తొక్కడం ద్వారా బీపీ, మధుమేహం, గుండెజబ్బులు లాంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్ అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె–ఎన్‌సీడీ పీఓ డాక్టర్ నివేదిత, డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయినాయక్, వైద్యులు నాగరాజునాయక్, డాక్టర్ జ్యోత్స్న, ఫణీంద్ర, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు సైకిళ్లలో పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. రోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

- దామానుపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం



ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న చిన్నారి కృషికా సాయిరెడ్డి, గ్రామస్తులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని దామానుపల్లి గ్రామంలో ఈదురు గాలులకు దెబ్బతిన్న పంటలను ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరిశీలించారు. ఈ సమయంలో గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గ్రామానికి చెందిన చిన్నారి కృషికా సాయిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చింది. వారం రోజుల్లోపు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే ఆ చిన్నారికి హామీ ఇచ్చారు. ఆ చిన్నారికి ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఆదేశాలతో శనివారం సర్పంచ్ శివారెడ్డి, బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు చిన్నారి కృషికా సాయిరెడ్డి, గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని శారదానగర్‌కు చెందిన సాకే గంగాధర్ (37) చేనేత కార్మికుడిగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ముడి సరుకుల ధరలు పెరగడంతో పాటు కరోనా సమయంలో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఉన్న ఒక్క మగ్గాన్ని నెలక్రితం అమ్మేసి కూలి మగ్గానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురైన గంగాధర్ అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య విజయమ్మ, కూతుళ్లు ప్రవల్లిక, సుప్రజ, లక్ష్మి, కుమారుడు ధనుష్ ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్‌ఓ ప్లాంటు ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న దాతలు

ధర్మవరం అర్బన్: రోగుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పల్లెం వెంకటేష్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు పల్లెం జనార్దన్, భార్య పల్లెం నిర్మల రూ.2.50 లక్షల ఖర్చుతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును శనివారం దాతలు ప్రారంభించారు. ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటుకు సహకరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం పార్థసారధి, పల్లెం వేణుగోపాల్, దాతలను ఆసుపత్రి సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉదయ్ భాస్కర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, రేడియోగ్రాఫర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

గుండెపోటుతో సీఆర్‌పీ మృతి

తనకల్లు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన సీఆర్‌పీ ఇండ్ల రమణ (53) గుండెపోటుతో మృతి చెందారు. అమడగూరు మండలం చినగానిపల్లి క్లస్టర్‌లో సీఆర్‌పీగా పని చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

వాహనం బోల్తా



చెల్లాచెదురుగా పడిన సిలిండర్లు

సోమందేపల్లి: గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న ఓ క్యాంటర్ వాహనం సోమందేపల్లి మండలం పేటకుంట సమీపంలో శనివారం బోల్తా పడింది. కర్నూలు నుంచి బెంగళూరుకు నిండు సిలిండర్లతో బయలుదేరిన వాహనం పేటకుంట పారిశ్రామిక వాడ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో జాతీయ రహదారి పక్కనే పల్లంలోకి బోల్తాపడింది. ఈ క్రమంలో సిలిండర్లు చెల్లాచెదురయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయకుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఓ సిలిండర్ నుంచి గ్యాస్ లీకవుతుండడం గమనించి, వెంటనే ఫైర్ సిబ్బందిని రప్పించి ప్రమాదాన్ని అరికట్టారు. ప్రమాదంలో స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సంతానం కలగలేదని యువకుడి ఆత్మహత్య

పెద్దవడుగూరు: సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన నరేంద్ర (29)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగలేదు. ఈ విషయంగా కుటుంబ సభ్యులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన చింత తోపులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

బ్లాస్టింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు



బండను పేల్చిన దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని గట్ల వద్ద జగనన్న కాలనీ, ఆర్‌ఆర్‌కాలనీ మధ్య రియల్టర్లు భూమిని చదును చేసేందుకు భారీ బ్లాస్టింగ్ నిర్వహించారు. ఈ పేలుడు ధాటికి బండ రాళ్లు సమీపంలోని నివాసాల వద్ద వచ్చిపడ్డాయని కాలనీవాసులు రూరల్ మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణ సిబ్బందితో కలిసి బ్లాస్టింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బ్లాస్టింగ్ నిర్వహించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా సదరు స్థలం టీడీపీ ముఖ్య నాయకుడైన నవాబు కోట శంకర్‌దని తెలుస్తోంది. భూమిని చదును చేసి అక్రమ లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయించుకునేందుకు చేస్తున్నారని జగనన్న కాలనీ వాసులు చెబుతున్నారు. కాగా నివాస ప్రాంతంలో ఇలా భారీ బ్లాస్టింగ్ చేయడం వల్ల కాలనీవాసులు బెంబేలెత్తున్నారు. అనుమతి లేకుండా బ్లాస్టింగ్ నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

భక్తులతో 'ఖాద్రీ' కిటకిట



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

ఆరుగురు తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: తహసీల్దార్ల బదిలీల్లో కొంత మార్పు చేసి ఆరుగురికి పోస్టింగ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను కలెక్టర్ గౌతమి జారీ చేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.విజయలక్ష్మిని ఫారిన్ సర్వీస్ కింద డ్వామాలో నియమించారు. బెళుగుప్ప తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టిని కలెక్టరేట్ సి.సెక్షన్ (మెజిస్టీరియల్) సూపరింటెండెంట్‌గా, అక్కడున్న డి.తిరుమలరెడ్డిని అనంతపురం ఆర్డీఓ కార్యాలయం ఏఓగా నియమించారు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దారు డి.నీలకంఠారెడ్డిని కేఆర్‌సీసీ తహసీల్దార్, స్పందన ఇన్‌చార్జ్‌గా నియమించారు. యాడికి తహసీల్దారు జి.అలెగ్జాండర్‌కు కలెక్టరేట్ ల్యాండ్ రిఫార్మ్స్ తహసీల్దారుగా పోస్టింగ్ ఇచ్చారు. అనంతపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓగా ఉన్న సి.విశ్వనాథ్‌కు యాడికి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు నియమించారు.

తాగునీటి శుద్ధి ప్లాంట్ల తనిఖీ

ధర్మవరం: పట్టణంలోని తాగునీటి శుద్ధి ప్లాంట్లను మున్సిపల్ ఎంఈ సత్యనారాయణ, ఏఈ హరీష్, ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వచ్ఛమైన నీటిని అందించాలని వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులను ఆదేశించారు.